క్లుప్తంగా

ఎఫ్‌పీవో అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు


ఉమామహేశ్వరరావును సత్కరిస్తున్న ఎఫ్‌పీవో సభ్యులు

వంగర: రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పీవో) అధ్యక్షుడిగా వెలగాడ ఉమామహేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఏపీఎం తెర్లి మంగమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఆ సంస్థ నూతన కార్యవర్గం ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా ఉదయాన గోపినాయుడు, కార్యదర్శిగా రౌతు అసిరినాయుడు, ఉప కార్యదర్శిగా సతిపిడకల ఆదినారాయణ, కోశాధికారిగా తుమ్మి ధర్మారావు ఎంపికయ్యారు. అనంతరం వారందరితో ఏపీఎం ప్రమాణ స్వీకారం చేయించగా, సభ్యులంతా తమ అధ్యక్షుడిని సత్కరించారు.

8న బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

తెర్లాం: మండలంలోని నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపికలు ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, శ్రీధర్‌లు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. అన్నవరంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయని, ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా బాలురు, బాలికల జట్లను ఎంపిక చేయనున్నామన్నారు. 16 ఏళ్ల లోపు ఉన్న క్రీడాకారులంతా ఉదయం 9 గంటలకు ఆధార్‌కార్డు తీసుకుని, రావాలని కోరారు.

ముందస్తు వినాయక చవితి వేడుకలు


ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

రామభద్రపురం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో ముందస్తు వినాయక చవితి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శనివారం నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో చిన్నారులకు పండగను పరిచయం చేయాలన్న ఉద్దేశ్యంతో ముందస్తుగా పండగ జరుపుకున్నామని అంగన్‌వాడీ కార్యకర్త తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పలువురు చిన్నారులు గణపతి వేషధారణలు, మాస్క్‌లతో అలరించారు.

వంగరలో క్లోరినేషన్ చర్యలు


తాగునీటి బావిలో క్లోరినేషన్ చేపడుతున్న ఆరోగ్య సిబ్బంది

వంగర: మండల కేంద్రంలోని రక్షిత మంచినీటి పథకాలు, తాగునీటి ట్యాంకులు, బావుల్లో క్లోరినేషన్ చర్యలు శుక్రవారం చేపట్టారు. ఏఎన్ఎం బి.విశాలాక్షి, ఆశ కార్యకర్తలతో కలిసి ఆయా తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టి, నీటిని శుభ్రం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, ప్రజలు కూడా వ్యాధుల బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎన్ఎం సూచించారు.

చురుగ్గా కల్వర్టు నిర్మాణ పనులు


కల్వర్టు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

రాజాం సిటీ: మండల పరిధిలోని కంచరాం ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో కల్వర్టు నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. కల్వర్టు పాడవడంతో ఇబ్బందులు పడుతున్న విషయంపై అధికారులకు కాలనీవాసులు వినతిపత్రం అందించారు. స్పందించిన అధికారులు కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. సర్పంచ్ గెడ్డాపు అప్పలనాయుడు శుక్రవారం నిర్మాణ పనులు పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

తొలిపూజకు వేళాయె..!


రేగిడి: మండపానికి గణేశుని విగ్రహాన్ని తరలిస్తున్న దృశ్యం


గణేశుని మండపాన్ని సిద్ధం చేస్తున్న యువకులు


రామభద్రపురంలో మట్టి వినాయక విగ్రహాలు విక్రయిస్తున్న చిరువ్యాపారి

వినాయక చవితి వేడుకలకు అంతా సిద్ధం చేశారు. మండపాల ఏర్పాట్ల దగ్గర నుంచి వినాయక విగ్రహాల తరలింపు వరకు అన్ని పనుల్లో యువత తలమునకలయ్యారు. శనివారం ఉత్సవాల మొదటిరోజు తొలిపూజకు అవసరమైన పూజాసామగ్రి కొనుగోలు చేసేందుకు భక్తులు కూడా మార్కెట్‌ల బాట పట్టారు. మరోవైపు మండపాల వద్ద విద్యుత్ దీపాలంకరణలు, సౌండ్ బాక్సుల ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. దీంతో అంతటా పండగ వాతావరణం నెలకొంది.


రాజాంలోని గాంధీ వీధిలో ఏర్పాటు చేసిన గణేశుని మండపం

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ


రామభద్రపురం: దుప్పలపూడిలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


రేగిడి: లచ్చారాయపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యవంతమైన శిశువుల ప్రదర్శన

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, సూర్యకుమారి, రత్నకుమారి

రామభద్రపురం: పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు, కిశోరి బాలికలు, ఇతర మహిళల్లో రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, సూర్యకుమారి, రత్నకుమారి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని దుప్పలపూడి, మామిడివలస తదితర గ్రామాల్లో పౌష్టికాహారం, దాని ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, అలా చేస్తేనే పట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఆరు నెలలు నిండిన ప్రతీ బిడ్డకు అదనపు పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే మేలును సిబ్బంది వివరించారు.

రేగిడి: చిన్నపిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి కనబరచాలని రాజాం ఐసీడీఎస్ పీవో కనకదుర్గ అన్నారు. మండలంలోని లచ్చారాయపురం, తునివాడ, వెంకమపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పౌష్టికాహార మాసోత్సవాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. పుట్టిన పిల్లలకు డబ్బా పాలు కాకుండా తల్లిపాలనే అందివ్వాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్యవంతమైన శిశువుల ప్రదర్శన చేపట్టారు. ఆరోగ్యంగా ఉన్న చిన్నారుల తల్లులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శశికళ, హెచ్ఎం హేమలత తదితరులు పాల్గొన్నారు.

రాజాం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్యాసమ్మ కోరారు. స్థానిక పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ పౌష్టికాహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని తెలిపారు.

వినాయక చవితి శుభాకాంక్షలు


డాక్టర్ తలే రాజేష్

రాజాం: నియోజకవర్గంలోని ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు అని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ తెలిపారు. ఇదే విషయమై స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో పండగ జరుపుకోవాలన్నారు. ఈ ఉత్సవాలు అన్నీ శుభాలే ఇవ్వాలని ఆకాంక్షించారు.

మట్టి విగ్రహాల తయారీపై శిక్షణ

సంతకవిటి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాల తయారీపై విద్యార్థులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. విగ్రహాలు ఏ విధంగా తయారు చేయాలన్న దానిని ప్రయోగాత్మకంగా వివరించిన అనంతరం విద్యార్థులతో విగ్రహాలు తయారు చేయించారు. ప్రధానోపాధ్యాయురాలు సాయిూశ్వరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరహాలనాయుడు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ లోడ్ లారీ బోల్తా



రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద అదుపుతప్పి ఐరన్‌లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడింది. శుక్రవారంపాలకొండ నుంచి రాజాం వైపు వస్తున్న ఈ లారీ ఉంగరాడమెట్ట వద్ద మలుపు తప్పించే క్రమంలో ఈ దుర్ఘటన సంభవించింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవరు శివ, క్లీనరు రామకృష్ణలకు స్వల్ప గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులంతా 108 వాహనానికి సమాచారం ఇచ్చి, చికిత్స నిమిత్తం రాజాం ప్రభుత్వాస్పత్రికి క్షతగాత్రులను తరలించారు.

భారీ వర్షం

బొబ్బిలి: పట్టణంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు గంటకు పైగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ముంపు ప్రాంతాలను పరిశీలించి, లోతట్టు ప్రాంతాల్లోని వరద నీటిని తరలించే పనులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రాజాం: తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిల్వ ఉండిపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటిని తరలించే ఏర్పాట్లు చేసేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యు.గదబవలసలో 'పీఎం జన్‌మన్'

తెర్లాం: మండలంలోని యు.గదబవలస గ్రామంలో పీఎం జన్‌మన్(ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖపై బాడంగి ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులంతా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మారుమూల ప్రాంతాల్లోని గిరిజనుల అభివృద్ధి కోసమే పీఎం జన్‌మన్ కార్యక్రమం అమలు చేయడం జరుగుతోందని తెలిపారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదని, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారని, ఈ విషయాన్ని ఎంపీడీవో ద్వారా కలెక్టరు దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

విద్యుత్ ఘాతానికి రెండు ఆవులు బలి



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న సర్పంచ్, అధికారులు
ఇన్‌సెట్‌లో మృతి చెందిన రెండో ఆవు

తెర్లాం: విద్యుత్‌షాక్‌కు గురై రెండు ఆవులు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎం.ఆర్ అగ్రహారం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. బాధిత రైతు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చేట్ల తౌడు తన రెండు ఆవులను మేత కోసం పొలానికి తీసుకుని వెళ్తున్నాడు. గ్రామం నుంచి కొంత దూరం వచ్చిన తర్వాత రోడ్డు పక్కన ఉన్న పాత గ్యాస్ గోదాము వద్ద విద్యుత్ వైర్లు తెగిపడి ఉన్నాయి. వాటిని గమనించని ఆ ఆవులు తెగిపడిన విద్యుత్ వైర్లను తొక్కేయడంతో అవి షాక్‌కు గురై, అక్కడికక్కడే మృతి చెందాయి. రెండు ఆవులు దాదాపు రూ.1.10 లక్షల విలువ ఉంటాయని, ఎంతో కష్టపడి పెంచుకుంటున్న ఆవులు చనిపోవడంతో సంబంధిత పాడిరైతు, అతడి కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ప్రతినిధి లొట్టి వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి హైమావతి, సచివాలయ పశు సంవర్ధకశాఖ సహాయకురాలు, విద్యుత్ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం వాటి విలువ ఎంత ఉంటుందో అంచనా వేసి తమకు అందజేస్తే తాము నష్టపరిహారం కోసం ప్రతిపాదనలు పంపిస్తామని మండల విద్యుత్ శాఖ ఏఈ సోమేశ్వరరావు తెలిపారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ


రేగిడి: కొండవలసలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న సీఐ ఉపేంద్ర


రాజాం సిటీ: మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ శ్రీనివాసరావు


రాజాం: గాంధీ వీధిలో మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య మహిళా సంక్షేమ మండలి సభ్యులు

రేగిడి: మండలంలోని కాగితాపల్లి, కొండవలస, చిన్నకోడిశ గ్రామాల్లోని ప్రజలకు రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర శుక్రవారం మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వీటిని అందజేయడం జరిగిందని, ప్రతిఒక్కరూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు వాడకుండా మట్టి విగ్రహాలను వినియోగించాలని ఆయన కోరారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస పంచాయతీలో ఉన్న రాచేరువలస గిరిజన గ్రామంలోని ప్రజలకు వనమిత్ర కృష్ణదాస్ శుక్రవారం మట్టి వినాయక ప్రతిమలు అందజేశారు. మట్టి విగ్రహాలనే వాడి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఆయన కోరారు.

రాజాం సిటీ: ప్రతి ఒక్కరం మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దామని వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పాలకొండ రోడ్డులో మట్టి గణేశుని ప్రతిమలను పంపిణీ చేసిన ఆయన.. ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలు పూజించి, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు, పెంకి చైతన్యకుమార్, పాలవలస శ్యామసుందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని రాజాం ఆర్యవైశ్య మహిళా సంక్షేమ మండలి ప్రతినిధి కొత్తా సీతారత్నం పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలోని గాంధీ వీధిలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసిన ఆమె.. పర్యావరణాన్ని పరిరక్షించడాన్ని కూడా ఓ పెద్ద పండగలా భావించాలని కోరారు. కార్యక్రమంలో రాజాం రెడ్‌క్రాస్ ప్రతినిధి కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, మండలి సభ్యులు పాల్గొన్నారు.

రెండో విడత నిధుల విడుదల


మాట్లాడుతున్న ఎంపీడీవో రమామణి

రామభద్రపురం: మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రెండో విడత కింద రూ.1.58 కోట్లు విడుదలైనట్లు ఎంపీడీవో రమామణి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణతో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆమె.. టైడ్ కింద రూ.60,35,732, అన్‌టైడ్ కింద రూ.40,22,468 విడుదలై పంచాయతీల ఖాతాలకు అడ్జస్ట్ అయ్యాయన్నారు. టైడ్ కింద విడుదలైన నిధులతో గ్రామాల్లోని పారిశుధ్యం, క్లాప్‌మిత్రల వేతనాలు, తాగునీటి సరఫరా, నిర్వహణతో పాటు మంచినీటి ట్యాంకుల విద్యుత్ చార్జీల కోసం ఖర్చు చేయనున్నామన్నారు. అలాగే అన్‌టైడ్ కింద విడుదలైన నిధులతో గ్రామ పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పన, గ్రామాభివృద్ధికి చర్యలు, వీధి దీపాల విద్యుత్ చార్జీలకు వినియోగించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ నిధులు పారదర్శకంగా ఖర్చు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించామన్నారు. కార్యక్రమంలో ఏపీవో త్రినాధరావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో విలీనం చేయండి


ఎంపీడీవో రవికుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి రూరల్: మండలంలోని కృపావలస, దీవెనవలస, రామన్నవలస, సియోనువలస గ్రామాలను వాటికి దగ్గరలోని పంచాయతీలో విలీనం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆ పార్టీ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలతో కలిసి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పి.రవికుమార్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. కనీస సదుపాయాలకు దూరంగా ఉన్న ఆ గ్రామాలను వాటికి దగ్గరలోని ఏదైనా గ్రామ పంచాయతీలో విలీనం చేస్తే అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కనీస వసతులు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి, ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోట అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి


యు.గదబవలస అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీస్కూల్‌కు హాజరవుతున్న చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించాలని ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని యు.గదబవలస గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించి, రికార్డులు, స్టాక్, పిల్లల హాజరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని, సమయపాలన పాటించాలని, ప్రీస్కూల్ పిల్లలకు విద్యతో పాటు మంచి ఆరోగ్యాన్ని కూడా ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు పిల్లల బరువులు, ఎత్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పక్కాగా అందించాలని, పౌష్టికాహారం ప్రయోజనాలను వివరించాలన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, తదితరులు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి పండగ జరుపుకోవాలని సీఐ నారాయణరావు కోరారు. శనివారం నుంచి గణేశుని ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ప్రసాదరావుతో కలిసి శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. బహిరంగ ప్రదేశాల్లో మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. విగ్రహాలను మండపాలకు తరలించినప్పుడు, నిమజ్జన సమయాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. ఉత్సవ రోజుల్లో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఎవరైనా తగాదాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

వంగర: వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీలు నిబంధనలు పాటించాలని ఎస్ఐ షేక్ శంకర్ అన్నారు. మండలంలోని వీవీఆర్ పేట, జేకేగుమ్మడ, పెదరాజులగుమ్మడ తదితర గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన మండపాల వద్ద ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాటించాల్సిన నియమ, నిబంధనలపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఎటువంటి వివాదాలు జరగకుండా భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకోవాలన్నారు.

నేత్రదానానికి ముందుకురావాలి


రాజాం సిటీ: ర్యాలీ ప్రారంభిస్తున్న ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిబాబు

రాజాం:

ప్రతిఒక్కరూ నేత్రదానానికి ముందుకురావాలని జీఎంఆర్ కేర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్ర పిలుపునిచ్చారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జీఎంఆర్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేత్రదానంతో ఎంతోమంది అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్న విషయం ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. నేత్రదానంపై ఉన్న అపోహలు వీడి, నేత్రదానానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లావేటి వెంకటేష్‌నాయుడు, డాక్టర్ కేఎన్ సత్యమాంబ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సంప్రదాయం కావాలి..

రాజాం సిటీ: నేత్రదానం కుటుంబ సంప్రదాయం కావాలని ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కరణం హరిబాబు అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చనిపోయిన వారి కళ్లను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఆదర్శనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి యు.కిరణ్ అవగాహన ర్యాలీ ప్రారంభించి, నేత్రదానంపై అందరినీ చైతన్యవంతులను చేయాలని కోరారు.

పొదుపు సంఘాల సొమ్ము వీవోఏ సొంతానికి!

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో ఉన్న పొదుపు సంఘాల సొమ్ము వీవోఏ తన సొంతానికి వాడుకున్నట్లు పలు సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో మొత్తం 108 సంఘాలు ఉండగా, కొన్ని సంఘాలకు చెందిన రూ.కోటి పైగా నిధులను ఆమె వాడుకున్నారని సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సంఘం నుంచి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల మేర బకాయి ఉన్నట్లు బ్యాంకుల నుంచి తమకు నోటీసులు అందితే గానీ అసలు విషయం తెలియరాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము తీసుకున్న రుణాలు తిరిగి కడుతున్నామని, వీవోఏ ఇంటి వద్దనే వారి ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు వినియోగదారుల సేవా కేంద్రం ఏర్పాటు చేయడం, దానిని వీవోఏ భర్త నిర్వహిస్తుండడంతో అనుమానాలకు బలం చేకూరుతోందన్నారు. ఆమె కూడా ఈ విషయంపై స్పష్టత ఇవ్వడం లేదన్నారు. తాము కట్టిన సొమ్ముకు సంబంధించిన లెక్క ఎప్పుడూ చెప్పడం లేదని, తమ పొదుపులు, రుణాలు, జమలు, తీర్మానాల పుస్తకాలు ఇమ్మని అడిగితే ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇదే విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేశామని తెలిపారు.